

సూక్ష్మపరిశీలకులే కీలకం

కలెక్టరేట్ : పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రక్రియ సజావుగా జరిగే విధంగా సూక్ష్మ పరిశీలకులు కీలకంగా విధులు నిర్వహించాలని జిల్లా రెవెన్యూ అధికారి జె.వెంకటరావు అన్నారు. బుధవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో మైక్రో అబ్జర్వర్లకు తుది విడత శిక్షణ తరగతులను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మైక్రో అబ్జర్వర్ ఎన్నికల ప్రక్రియ సక్రమంగా జరిగేలా నిశితంగా పరిశీలించాలన్నారు. పట్టభద్రులు స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకొనేలా మహిళలు, విభిన్న ప్రతిభావంతులు, వృద్ధులకు ప్రత్యేక క్యూలైన్ ఏర్పాటు చేయాలన్నారు. మైక్రో అబ్జర్వర్ల డైరీలోని నిబంధనలు పాటించాలని సూచించారు. చెక్ లిస్ట్ ప్రకారం సరిచూసుకోవాలని తెలిపారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఏమైనా ఇబ్బందులు తలెత్తితే ప్రిసైడింగ్ అధికారి దృష్టికి తీసుకురావాలని సూచించారు. 13న పోలింగ్‌కు ముందు పారదర్శకతకు ఖాళీ బ్యాలెట్ బాక్స్‌ను ఏజెంట్ సమక్షంలో చూపించి పోలింగ్ ప్రారంభించాలని చెప్పారు. ఎన్నికల ప్రక్రియ ముగిసేవరకు పగడ్బందీగా నిర్వహించేందుకు తీసుకోవలసిన జాగ్రత్తలపై శిక్షణ ఇచ్చారు.



గిరిజన యూనివర్సిటీకి స్థల పరిశీలన చేస్తున్న కేంద్ర బృందం(ఫైల్)

రాష్ట్ర విభజన సందర్భంగా జిల్లాకు కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన హామీల్లో ఒక్కటంటే ఒక్క హామీ కూడా నెరవేరలేదు. పైగా కేంద్ర వైఖరి వల్ల ఉన్న కొద్దిపాటి ఉద్యోగాలు, ఉపాధి మార్గాలు కోల్పోవాల్సివచ్చింది. జిల్లా అభివృద్ధి మూడు అడుగులు ముందుకు ఆరడుగులు వెనక్కి అన్న చందంగా మారింది. దీనిపై రాష్ట్రంలో నేడు అధికారం చలాయిస్తున్న వైసిపి ప్రభుత్వంగానీ, ప్రతిపక్ష పాత్ర పోషిస్తున్న టిడిపిగానీ ప్రశ్నించడం లేదు. అంతుకు ముందు అధికారంలోవున్నప్పుడు కూడా టిడిపి కేంద్రంపై ఒత్తిడిచేయలేదు. దీంతో, విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల అభివృద్ధి మరింత ప్రశ్నార్థకంగా మారింది. శాసన మండలిలో పిడిఎఫ్ ఎమ్మెల్సీలు మాత్రం బిజెపి ఇచ్చిన హామీలపై నిరంతరం ప్రశ్నిస్తునే ఉన్నారు. కేంద్రంపై ఒత్తిడి చేయాలంటూ శాసన మండలిలో ఎంతముత్తుకుంటున్నా అధికార, ప్రతిక్ష పార్టీ సభ్యుల్లో చలనం రావడం లేదు.

నెరవేరని విభజన హామీలు

- బిజెపిని ప్రశ్నించని వైసిపి, టిడిపి
- శాసనమండలిలో నిలదీసిన పిడిఎఫ్ ఎమ్మెల్సీలు
- ఎన్నికల వేళ సర్వత్రా చర్చ

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

రాష్ట్ర విభజన నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు విజయనగరం ఉమ్మడి జిల్లాలో పారిశ్రామిక నగరాన్ని నిర్మిస్తామని, ఫుడ్‌పార్కులు, ఎలక్ట్రానిక్ అండ్ హార్డ్‌వేర్ పార్కు ఏర్పాటు చేస్తామని, గిరిజన యూనివర్శిటీని నిర్మిస్తామని, విజయనగరాన్ని స్మార్ట్ సిటీగా తయారు చేయారు చేస్తామని అప్పటి రాష్ట్ర ప్రభుత్వం హామీలు గుప్పించింది. అటు పూసపాటిరేగ తీరంలో పోర్టు, భోగాపురంలో గ్రీన్ ఫీల్డ్ ఎయిర్‌పోర్టు నిర్మిస్తామని కూడా చెప్పింది. విద్యల నగరమైన విజయనగరంలో సంగీత, లలిత కళల అకాడమీ ఏర్పాటుకు హామీ ఇచ్చింది. దీంతోపాటు వెనుకబడిన జిల్లాకు ప్రత్యేక నిధులు కేటాయిస్తామని నమ్మబలికింది. ఏడాదిలో తోటపల్లి సాగునీటి ప్రాజెక్టును పూర్తి చేస్తామని చెప్పింది. ఇవేవీ ఆచరణలో నెరవేరలేదు. వైసిపి అధికారంలోకి వచ్చాక కూడా వీటన్నింటినీ పక్కనబెట్టింది.

ముఖ్యంగా విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాలు పూర్తిగా వ్యవసాయ ఆధారితంగా మనుగడ సాగిస్తున్నాయి. వర్షాలకు కొదవలేదు. కానీ, సాగునీటి వనరులను అభివృద్ధి చేయకపోవడం వల్ల నీరంతా వృథాగా పోతోంది. దీంతో, మన జిల్లాకు వ్యవసాయ రంగం ద్వారా కేవలం 41.2శాతం మాత్రమే వస్తోంది. ఈ వెనుకబాటును అధిగమించేందుకు కేంద్రం సాయం చేయకపోవడంతో తోటపల్లి సాగునీటి ప్రాజెక్టు పనులు పడకేసింది. వైసిపి అధికారంలోకి వచ్చిన తరువాత ఏటా కేటాయింపులు తప్ప ఒక్క రూపాయి కూడా విడుదల చేయకపోవడంతో తోటపల్లి ప్రాజెక్టు లక్ష్యం నీరుగారుతోంది. 16ఏళ్లు కావస్తున్నా రామతీర్థసాగర్ పనులు ముందుకు సాగడం లేదు. అటు ఫుడ్ పార్కుల హామీ నెరవేరలేదు. అటు పారిశ్రామిక, సేవా రంగాల్లోనూ వెనుకబాటు ఉంది. జిల్లాకు వస్తున్న ఆదాయంలో పారిశ్రామిక రంగం ద్వారా పారిశ్రామిక రంగంలో అభివృద్ధి 15.9శాతంగా ఉంది. ఈ నేపథ్యంలో జిల్లాలో పారిశ్రామిక నగరాన్ని ఏర్పాటు చేస్తామని, ఎలక్ట్రానిక్ అండ్ హార్డ్‌వేర్ పార్కు హామీ ఇచ్చినప్పటికీ ఒక్క అడుగు కూడా ముందుకు వేయలేదు. పైగా కేంద్ర ప్రభుత్వ వైఖరి వల్ల జిల్లాలో జ్యూట్, చక్కెర మిల్లులన్నీ మూతపడ్డాయి. ఫెర్రో ఎల్లాయిస్ పరిశ్రమలు చావు బతుకుల మధ్య కొట్టుమిట్టాడుతున్నాయి. దీంతో, బిజెపి అధికారంలోకి వచ్చిన తరువాత ఉమ్మడి విజయనగరం జిల్లాల్లో సుమారు 30వేల మంది కార్మికులు ఉపాధి కోల్పోయారు. మరోవైపు విజయనగరం జిల్లా కేంద్రంలోని విటి అగ్రహారం, బొబ్బిలి గ్రోత్ సెంటర్, సారిపల్లి, కంటకాపల్లి పారిశ్రామిక వాడల్లో అనేక పరిశ్రమలు కనుమరుగయ్యాయి. మరికొన్ని ప్లాట్లలో అసలు పరిశ్రమలే ఏర్పాటు చేయలేదు. ఇలా విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాలు పారిశ్రామిక రంగంలో రాష్ట్రంలోనే వెనుకబడ్డాయనడంలో సందేహం లేదు. గిరిజన వర్శిటీ అడ్మిషన్లు ప్రారంభించి మూడేళ్లు గడుస్తున్నా ఇప్పటికీ శాశ్వత ప్రతిపాదికన భవన సముదాయం నిర్మాణానికి చర్యలు తీసుకోలేదు. స్థల గుర్తింపు, సేకరణ పేరుతో కేంద్ర ప్రభుత్వం కాలక్షేపం చేస్తోంది. దీంతో, తరగతులు, ప్రయోగాలు పరాయి పంచన సాగుతున్నాయి. జిల్లాలో పోర్టు నిర్మాణం విషయమై కనీస ప్రస్తావన లేదు. గ్రీన్ ఫీల్డ్ ఎయిర్ పోర్టు పేరిట సుమారు 2వేల ఎకరాలు సేకరించి ఏళ్లు గడుస్తున్నప్పటికీ నిర్మాణం చేపట్టలేదు.

ప్రజల గొంతునై పోరాడుతా



రాష్ట్ర విభజన హామీలు నెరవేర్చకపోవడం వల్ల విజయనగరం జిల్లాకు చాలా అన్యాయం జరిగింది. కేంద్రం ఎంతో మోసం చేసినప్పటికీ రాష్ట్రంలోని వైసిపి, టిడిపిలు ప్రశ్నించడం లేదు. తనను ఎమ్మెల్సీగా గెలిపిస్తే పిడిఎఫ్ తరపున మరింతగా మండలిలోనూ, బయట చర్చపెడతాను. ప్రజలే తగిన గుణపాఠం చెప్పేవిధంగా ప్రయత్నిస్తాను.

– డాక్టర్ కోరెడ్ల రమాప్రభ, ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజకవర్గ పిడిఎఫ్ అభ్యర్థి

లివిరిలో ఘనంగా హోలీ



లివిరిలో హోలీ సంబరాల్లో పాల్గొన్న జనం


ప్రజాశక్తి -భామిని

మండలంలోని లివిరి గ్రామంలో రాధా గోపినాథస్వామి డోలో యాత్ర ఉత్సవాల్లో భాగంగా బుధవారం హోలీ పండగను, పల్లకిలో ఉత్సవ విగ్రహాల ఊరేగింపు, నది స్నానాల కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. చారిత్రక విశిష్టత కలిగిన, ఒడిశా, ఆంధ్రా సంప్రదాయాలతో కొలవబడుతున్న దేవాలయం కావడంతో హోలీ ఉత్సవాలు ఏటా ఇక్కడ వైభవంగా నిర్వహిస్తున్నారు. హోలీ ఉత్సవాలకు పర్లాకిమిడి మహారాజు అశోక గజపతి కుమార్తె కళ్యాణి గజపతి పాల్గొని, పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యే వి.కళావతి, వైసిపి నియోజకవర్గ వైసిపి పరిశీలకులు డోల జగన్, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ ప్రజలతో కలిసి హోలీ ఉత్సవాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు కళ్యాణి గజపతిని శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమం మాజీ జెడ్‌పిటిసి సోమరాజు గోపాలరావు, పిఎసిఎస్ డైరెక్టర్ గెల్లంకి రమేష్, బౌరి త్రినాథ్, గౌడు కైలాష్ పాల్గొన్నారు.

పార్వతీపురం టౌన్ : హోలీ వేడుకలను బుధవారం పట్టణంలోని ప్రధాన రహదారితోపాటు పలు వార్డులలో ఘనంగా నిర్వహించారు. పెద్దలతోపాటు మహిళలు, చిన్నారులు రంగులను పూసుకున్నారు.

ఉత్తరాంధ్ర సమగ్రాభివృద్ధికి కృషి

పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ కోరెడ్ల రమాప్రభ



షిప్‌యార్డ్ గేటు వద్ద ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ అభ్యర్థి రమాప్రభ

ప్రజాశక్తి-అనకాపల్లి

ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా గెలిపిస్తే ఉత్తరాంధ్ర సమగ్రాభివృద్ధితో పాటు సిపిఎస్ రద్దు, ఉద్యోగులకు ఇచ్చిన హామీల పరిష్కారం, ప్రభుత్వ సంస్థల పరిరక్షణ, కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల క్రమబద్ధీకరణ, జిఒ నెంబరు 3 పునరుద్ధరణ వంటి పలు అంశాలపై శాసనమండలిలో ప్రస్తావిస్తానని పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ కోరెడ్ల రమాప్రభ చెప్పారు. స్థానిక దొడ్డి రామినాయుడు కార్మిక, కర్షక భవనంలో బుధవారం జరిగిన విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడారు. రాష్ట్ర విభజన చట్టం హామీ ప్రకారం వెనుక బడిన ప్రాంతాల అభివృద్ధి నిధులు ఉత్తరాంధ్ర జిల్లాలకు రాబెట్టేందుకు శక్తివంచనలేకుండా కృషిచేస్తానన్నారు. 250కిపైగా ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్లు, ప్రజా సంఘాలు బలపర్చిన అభ్యర్థిగా ప్రజా సమస్యల పరిష్కారం కోసం పనిచేస్తానన్నారు. రూ.3.50 లక్షల కోట్ల విలువైన విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను రూ.30వేల కోట్లకు విక్రయించే ప్రభుత్వ ప్రయత్నాలను అడ్డుకోవడానికి కృషి చేస్తానని చెప్పారు. ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణకు పోరాడతానన్నారు. ఉద్యోగులు, కార్మికులు, నిరుద్యోగుల సమస్యల కోసం పనిచేసే వేదిక పిడిఎఫ్ అని తెలిపారు. పిడిఎఫ్ తరపున పోటీచేస్తున్న తనను గెలిపిస్తే ఆయా తరగతుల సమస్యలపై పనిచేస్తానన్నారు. స్కీం వర్కర్ల సమస్యలపై కూడా శాసనమండలిలో ప్రస్తావించి వాటిని బలోపేతం చేయడానికి ప్రయత్నిస్తానన్నారు. ఉత్తరాంధ్రలో మూతపడ్డ సహకార చక్కెర కర్మాగారాల పునరుద్ధరణకు ప్రభుత్వంపై ఒత్తిడితెస్తానని చెప్పారు. ఈ సమావేశంలో ఐద్వా రాష్ట్ర అధ్యక్షులు బి.ప్రభావతి, మధ్యాహ్న భోజన పథకం కార్మికుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు జి.వరలక్ష్మి, ఎల్ఐసి ఉద్యోగుల యూనియన్ నాయకులు మళ్ల చంద్రశేఖరరావు, సిఐటియు జిల్లా అధ్యక్షులు రుత్తల శంకరరావు, గొర్రెలు, మేకల పెంపకం దార్ల సంఘం రాష్ట్ర అధ్యక్షులు గంటా శ్రీరామ్, రిటైర్డ్ ఉద్యోగ సంఘం నాయకులు బి.ఉమా మహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

షిప్‌యార్డు ఉద్యోగ, కార్మికుల హక్కుల పరిక్షణకు కృషి

ములగాడ : హిందుస్థాన్ షిప్‌యార్డ్ సంస్థలోని ఉద్యోగ, కార్మికుల హక్కులు సాధనకు నిబద్దతతో కృషి చేస్తానని పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ కోరెడ్ల రమాప్రభ హామీఇచ్చారు. బుధవారం ఎన్నికల ప్రచారంలో భాగంగా షిప్‌యార్డు గేటు వద్ద ఉద్యోగులు, కార్మికులను కలిసి మాట్లాడారు. విశాఖ అభివృద్ధిలో హిందుస్థాన్ షిప్‌యార్డుకు విశేష ప్రాధాన్యత ఉందని, సంస్థ అభివృద్ధికి పాటుపడతానన్నారు. రాజకీయాలకు అతీతంగా 250 ప్రజాసంఘాలు తనకు మద్దతునిస్తున్నాయని, వారి ఆశలు, ఆకాంక్షలు వమ్ముకాకుండా, అందరి పక్షాన నిలబడి పోరాటం కొనసాగిస్తానని భరోసానిచ్చారు. కార్యక్రమంలో షిప్‌యార్డు గుర్తింపు యూనియన్ ప్రధాన కార్యదర్శి ఎంవి.రమణమూర్తి, షిఫ్ యార్డు సిఐటియు అధ్యక్ష ,ప్రధాన కార్యదర్శులు రాంజీ, అంబేద్కర్, ఎస్.ప్రసాద్, ఎఐటియుసి నేతలు మళ్ల చిన్నా, సిఐటియు జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు, జోన్ నాయకులు పి.పైడిరాజు, యూనియన్ నేతలు బిఎస్ఎన్ రాజు, జి.సత్యనారాయణ, ప్రసాద్, కె.రామచంద్రరావు, గోవింద్ పాల్గొన్నారు.

పరిశ్రమల స్థాపనతో
6 లక్షలకు పైగా ఉద్యోగాలు

డిప్యూటీ సిఎం రాజన్నదొర




మాట్లాడుతున్న డిప్యూటీ సిఎం రాజన్నదొర

ప్రజాశక్తి-పాచిపెంట

సుమారు రూ.13 లక్షల కోట్లతో రాష్ట్రంలో పరిశ్రమల స్థాపన ద్వారా ఆరు లక్షలకు పైగా ఉద్యోగావకాశాలను ప్రభుత్వం కల్పిస్తుందని డిప్యూటీ సిఎం పి.రాజన్నదొర తెలిపారు. బుధవారం మండలంలోని పాంచాలి గ్రామంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఎపిలో నిరుద్యోగ సమస్య తీరుతుందని, ఆ ఘటన సిఎం జగన్‌కే దక్కుతుందని చెప్పారు. కుల, మత భేదాలు, రాజకీయ పార్టీలతో సంబంధం లేకుండా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నట్లు తెలిపారు. గతంలో ఉమ్మడి రాష్ట్రంగా ఉన్నప్పుడు ఎపి వనరుల గురించి చెప్పలేదని ఆరోపించారు. దేశ పునర్నిర్మాణానికి మన రాష్ట్రమే కీలకం కాబోతుందని వివరించారు. ఈ సమావేశంలో వైసిపి నాయకులు వీరంనాయుడు, గౌరీశ్వరరావు, పెద్దిబాబు, జి.ముత్యాలనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

క్షుద్రపూజల పేరుతో
మహిళలకు వల
కటకటాల్లోకి నిందితుడు



నిందితుడు సునీల్

ప్రజాశక్తి-బొబ్బిలి

క్షుద్రపూజలు చేసి ఆరోగ్యాన్ని మెరుగు చేస్తానని మాయమాటలు చెప్పి పలువురు మహిళలను వలలో వేసుకున్న బొబ్బిలి పట్టణానికి చెందిన ఒక కేటుగాడు కటకటాలు పాలయ్యాడు. బుధవారం బాధిత యువతి విలేకర్ల సమావేశంలో ఇందుకు సంబంధించిన వివరాలను వెల్లడించింది. ఆమె తెలిపిన వివరాలు ప్రకారం.

బొబ్బిలి పట్టణం ఆకులరెల్లివీధికి చెందిన ఆకుల సునీల్ గ్రోత్ సెంటర్లో ప్రైవేట్ పరిశ్రమలో సెక్యూరిటీ గార్డుగా పని చేసేవాడు. సునీల్ ప్రవర్తన బాగోకపోవడంతో యాజమాన్యం తొలగించింది. దీంతో తాను క్షుద్ర పూజలు చేస్తానని, ఆరోగ్యం బాగోలేని వారికి క్షుద్రపూజలు చేసి బాగు చేస్తానని చెప్పి తెలిసిన వారికి, బంధువుల్లోనూ ప్రచారం చేశాడు. అనారోగ్యంతో బాధపడుతున్న కొంతమంది మహిళలు నమ్మి సునీల్ ను ఆశ్రయించేవారు. ఇదే అదనుగా భావించిన సునీల్ మాయమాటలు చెప్పి క్షుద్రపూజలు పేరుతో మత్తు మందు ఇచ్చి లొంగదీసుకునే వాడని ఆరోపణలు వస్తున్నాయి. తెర్లాం మండలం తమ్మయ్యవలసకు చెందిన ఒక యువతికి ఎప్పటికప్పుడు ఆరోగ్యం బాగోకపోవడంతో బొబ్బిలి మండలానికి చెందిన ఒక ఫాస్టర్ సమాచారంతో మూడేళ్ళ క్రితం బాధిత యువతి క్షుద్రపూజల కోసం ఆకుల సునీల్ ను ఆశ్రయించింది. క్షుద్ర పూజలతో జబ్బును నయం చేసి ఆరోగ్యవంతంగా తయారు చేస్తానని చెప్పి యువతిని నమ్మించి ఒక గదిలో ఉంచి మత్తు మందు ఇచ్చి శారీరకంగా అనుభవించేవాడు. రెండేళ్ల క్రితం పెళ్లి చేసుకోవాలని గట్టిగా అడిగితే పెళ్లి చేసుకున్నాడు.కొద్దిరోజులు ఇందిరమ్మ కాలనీలో ఉంచి తర్వాత హైదరాబాద్ వెళ్లి తిరిగి రాలేదు. ఆమెపై సునీల్ తల్లిదండ్రులు దాడి చేయడంతో పాటు సునీల్ మోసం చేయడంతో మూడు వారాలు క్రితం యువతి బొబ్బిలి పోలీసులకు పిర్యాదు చేసింది. ఈనేపథ్యంలో పోలీసులు అతడిని అరెస్టు చేసి కోర్టులో ప్రవేశపెట్టగా కోర్టు మూడు వారాలు రిమాండ్ విధించింది. తనలా చాలా మంది మహిళలు మోసపోయారని ఆ యువతి వాపోయింది.

కోడి రక్తం తాగుతూ..

క్షుద్ర పూజలు పేరుతో సునీల్ అమ్మాయిలకు వల వేస్తున్నట్లు చర్చ జరుగుతోంది. యువతుల తల్లిదండ్రులను నమ్మించేందుకు నాటు కోళ్లను చంపి రక్తాన్ని తాగడంతో పాటు రక్తాన్ని ఇంటిలో జల్లి పూజలు చేసి నమ్మించేవాడని బాధితులు చెప్పారు. పూజలు చేసే సమయంలో ఇంటిలో ఎవరు ఉండకూడదని చెప్పి తలుపులు వేసి అమ్మాయిలపై అఘాయిత్యాలకు పాల్పడే వాడని చుట్టుపక్కల వారు చెబుతున్నారు. అమ్మాయిలను మోసం చేస్తున్న సునీల్ ను కఠినంగా శిక్షించాలని బాధిత యువతి డిమాండ్ చేసింది.

హక్కుల అమలుకు ఐక్య పోరాటం

ఐద్వా జిల్లా కార్యదర్శి ఆర్.శ్రీదేవి • ప్రజా సంఘాల ఆధ్వర్యాన మహిళా దినోత్సవ వేడుకలు



సదస్సులో మాట్లాడుతున్న ఐద్వా జిల్లా కార్యదర్శి ఆర్.శ్రీదేవి

ప్రజాశక్తి-కలెక్టరేట్

మహిళల హక్కులు, చట్టాల అమలు కోసం ఐక్య పోరాటం చేయాలని ఐద్వా జిల్లా కార్యదర్శి ఆర్.శ్రీదేవి, శ్రామిక మహిళా సంఘం జిల్లా నాయకులు వి.ఇందిర పిలుపునిచ్చారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా యుటిఎఫ్, సిఐటియు, ఐద్వా, ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో యుటిఎఫ్ జిల్లా సహాధ్యక్షులు ఎ.జ్యోతి అధ్యక్షతన పట్టణంలోని అగ్రహారంవీధిలో ఉన్న హిందీ కళాశాలలో బుధవారం సదస్సు ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళా దినోత్సవం మహిళా పోరాటాలకు స్ఫూర్తినిస్తుందన్నారు. హక్కుల సాధన దీక్షా దినంగా పాటించాలన్నారు. ప్రభుత్వం పెంచిన ధరల వల్ల పౌష్టికాహార లోపంతో మహిళలు రక్తహీనతకు లోనవుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. ప్రభుత్వం మద్యం నియంత్రించక పోవడంతో అనేక కుటుంబాలు ఆర్థికంగా చితికి పోతున్నాయని చెప్పారు. గిరిజన ప్రాంతాల్లో మహిళలకు విద్య, వైద్యం కరువవుతున్నాయని వాపోయారు. ప్రభుత్వ ప్రచార ఆర్భాటాల్లో ఉన్న శ్రద్ధ ఆచరణలో లేదన్నారు. నేటికీ మహిళలపై దాడులు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తంచేశారు. మహిళా దినోత్సవ స్ఫూర్తితో శ్రామిక మహిళలంతా హక్కుల కోసం, చట్టాల అమలు కోసం ఐక్య పోరాటాలకి సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. అనంతరం యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు టి.రమేష్, డివైఎఫ్ఐ నాయకులు ఎం.వెంకటరమణ, ఎస్ఎఫ్ఐ నాయకులు కె.రాజు మాట్లాడారు. కార్యక్రమంలో శ్రామిక మహిళ నాయకులు జి.తులసి, ఎం.గౌరి, మాధురి, సింహాచలం, చిలకమ్మ, తదితరులు పాల్గొన్నారు.

గుమ్మలక్ష్మీపురం : కె.శివడ గ్రామంలో యుటిఎఫ్ ఆధ్వర్యంలో కుక్కిడి మాజీ సర్పంచ్ బిడ్డిక చామంతి, ఐద్వా నాయకురాలు ఆరిక రాజకుమారి, అంగన్వాడీ కార్యకర్త మండంగి భారతి, ఆశా కార్యకర్త ఆరిక జానకి, పత్తిక హైమావతిని సన్మానించారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు తోట రమేష్, కార్యదర్శి కూర్మారావు, మండల అధ్యక్ష, కార్యదర్శులు ఎం.చలపతిరావు, పత్తిక ప్రసాదరావు, గౌరవ అధ్యక్షులు మండంగి భాస్కర్ రావు, పత్తిక శంకర రావు, చెముడు గూడ, ఇరిడి ఎంపిటిసిలు మండంగి రమణ, కద్రక మల్లేశ్వరరావు, గిరిజన సంఘం నాయకులు బిడ్డక శంకర్రావు ఉన్నారు.

సీతంపేట : సిఐటియు కార్యాలయంలో యుటిఎఫ్ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ నాయకులు మహిళలను సత్కరించారు. అనంతరం యుటిఎఫ్ జిల్లా గౌరవ అధ్యక్షులు ఆరిక భాస్కరరావు మాట్లాడుతూ ఆడపిల్లలను ఉన్నత చదువులు చదివించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి కుండంగి కృష్ణారావు, మండల ప్రధాన కార్యదర్శి పాలక కృష్ణారావు, యుటిఎఫ్ సభ్యులు బిడ్డిక జయప్రకాశ్, పాలక శ్రీనివాస్, చంద్రకళ, శ్రీదేవి, అనూష, అంగన్వాడీ యూనియన్ మండల కార్యదర్శి దర్శిమి తదితరులు పాల్గొన్నారు

సీతానగరం : మహిళల హక్కుల కోసం పోరాటం చేయాలని సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు జి.జ్యోతి అన్నారు. బుధవారం సీతానగరంలో మహిళా దినోత్సవ సదస్సు ఏర్పాటుచేశారు. శ్రామిక మహిళా జిల్లా నాయకులు వి.రామలక్ష్మి మాట్లాడుతూ మహిళలు సమానత్వం, సమాన హక్కుల కోసం పోరాటాలు కొనసాగించాలన్నారు. కార్యక్రమంలో మధ్యాహ్న భోజన కార్మికుల సంఘం మండల నాయకులు వై.శాంతకుమారి, ఐద్వా నాయకులు రెడ్డి లక్ష్మి, సిఐటియు నాయకులు జి.వెంకటరమణ, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు ఆర్.ఈశ్వరరావు, ఎపి రైతు సంఘం నాయకులు బి.అప్పారావు పాల్గొన్నారు.

సాలూరు : సమాజంలో స్త్రీ పురుష సమానత్వం అనేది ఆచరణలో అమలు జరిగేలా ప్రభుత్వాలు చూడాలని యుటిఎఫ్ జిల్లా నాయకులు ఐ.రాజమణి కోరారు. పట్టణంలోని ఎస్‌టి పోస్ట్ మెట్రిక్ బాలికల హాస్టల్లో ఎస్ఎఫ్ఐ, ఐద్వా, సిఐటియు ఆధ్వర్యాన నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. లింగ వివక్ష లేదని ప్రచార ఆర్బాటానికి ప్రాధాన్యత ఇవ్వకుండా ఆచరణలో కార్యరూపం దాల్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు. యుటిఎఫ్ మండల అధ్యక్షులు కోట జానకీరావు, జిల్లా కమిటీ సభ్యులు కె.లీల, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు డి.పండు, హాస్టల్ సంక్షేమ అధికారి రోజా, సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్‌వై నాయుడు, ఎస్ఎఫ్ఐ డివిజన్ నాయకులు వరుణ్ పాల్గొన్నారు.

సాలూరురూరల్ : మండలంలోని మామిడిపల్లిలో నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ సభలో ఐద్వా, అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ నాయకులు మాట్లాడుతూ మహిళలపై దాడులను నిరోధించడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కఠినమైన చట్టాలను తీసుకురావాలని డిమాండ్‌చేశారు. ఈ సమావేశంలో సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్‌వై నాయుడు, సిఐటియు మండల కార్యదర్శి హారిక, నారాయణమ్మ, జానకి, కుమారి పాల్గొన్నారు.



గుమ్మలక్ష్మీపురం.. మహిళలను సన్మానిస్తున్న యుటిఎఫ్ నాయకులు



సాలూరు.. సభలో మాట్లాడుతున్న యుటిఎఫ్ జిల్లా నాయకులు రాజమణి



సీతంపేట.. మాట్లాడుతున్న యుటిఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షులు భాస్కరరావు

విఆర్‌ఒపై దాడి చేసిన వారిని శిక్షించాలి



ఫిర్యాదు చేస్తున్న విఆర్‌ఒలు

ప్రజాశక్తి పార్వతీపురం రూరల్

విధి నిర్వహణలో ఉన్న నరిసిపురం విఆర్‌ఒపై దాడి చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలని విఆర్‌ఒల సంఘం డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు మరడ సింహాచలం, సంభంగి పురుషోత్తమ నాయుడు డిమాండ్ చేశారు. ఈ మేరకు కలెక్టర్, జెసి, ఆర్‌డిఒలకు వినతులు అందించారు. పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నర్సిపురం-1 సచివాలయ ఇన్‌ఛార్జి విఆర్‌ఒ అల్లు ఉమామహేష్ విధులు ముగించుకొని మంగళవారం రాత్రి 8 గంటల సమయంలో తహశీల్దార్ కార్యాలయానికి వెళ్తున్నారని తెలిపారు. మార్గం మధ్యలో ట్రాక్టర్లతో గ్రావెల్ వేస్తుండగా ట్రాక్టరు యజమాని తల్లాడ శ్రీనివాసరావును గ్రావెల్ ఎక్కడ నుంచి తీసుకొస్తున్నారని విఆర్‌ఒ ప్రశ్నించారని తెలిపారు. దీంతో అంతు చూస్తానని విఆర్‌ఒను బెదిరించి, కాలర్ పట్టుకుని దూషించారని చెప్పారు. ఈ ఘటనలో షర్టు కూడా చిరిగిపోయిందన్నారు. ప్రాణభయంతో అక్కడ నుంచి పారిపోయి తహశీల్దారుకు రిపోర్టు చేసినట్లు తెలిపారు. శ్రీనివాసరావు సోదరుడు అప్పలనాయుడు ఫోన్ చేసి, కేసు పెడితే ప్రాణాలతో ఉండవని బెదిరించారని ఆందోళన వ్యక్తంచేశారు. ఈ విషయమై రూరల్ ఎస్ఐ సింహాచలం స్పందిస్తూ కేసు నమోదు చేసినట్లు తెలిపారు.



రేషన్ బియ్యం పంపిణీ వాహనంపై తొలగించని సిఎం జగన్ చిత్రపటం

ఎన్నికల కోడ్ వీటికి వర్తించదా?

ప్రజాశక్తి-సాలూరు రూరల్

ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా ఎన్నికల కోడ్ అమల్లో ఉంది. ఎన్నికల నిబంధనలను పటిష్టంగా అమలు చేస్తున్నట్లు ఓవైపు అధికారులు కోడై కూస్తున్నారు. రాజకీయ నాయకుల విగ్రహాలకు, చిత్రపటాలకు తప్పనిసరిగా ముసుగులు ధరించాల్సిందే. ఇలా ఎన్నికల కమిషన్ ఎన్నో నిబంధనలు పెట్టినా అవేవీ అధికార పార్టీ వారికి వర్తించనట్లుంది. మండలంలో ఇంటింటికి రేషన్ బియ్యం అందించే వాహనాలు 10 వరకూ ఉన్నాయి. ప్రతి వాహనంపైనా సిఎం జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటం ఉంది. ఈ వాహనాల్లో ఒక్క దానిపైనా సిఎం బొమ్మలను కనిపించకుండా చేయడం గానీ, తొలగించడం గాని జరగలేదంటే ఎన్నికల కమిషన్ ఆదేశాలను మండలంలో అధికారులు ఎలా అమలు చేస్తున్నారో ఇట్టే అర్థమవుతుంది.

పది మందిలో ఒకరికి కిడ్నీ వ్యాధి

ప్రజాశక్తి- విజయనగరం

ప్రస్తుతం ప్రతి పది మందిలో ఒకరు కిడ్నీ వ్యాధితో బాధపడతున్నారని తిరుమల ఆస్పత్రి వైద్యులు డాక్టర్ ఆర్ శివకుమార్ అన్నారు. శుక్రవారం జరగనున్న వరల్డ్ కిడ్నీ డే సందర్భంగా గురువారం ప్రజాశక్తితో మాట్లాడారు. మూత్రపిండాల ఆరోగ్యం యొక్క ప్రాముఖ్యత గురించి ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలి. లక్షలాది మంది ప్రజలు కిడ్నీ వ్యాధితో బాధపడుతున్నారు. మూత్రపిండాల వ్యాధికి ప్రధాన ప్రమాద కారకాలు అధిక రక్త పోటు, డయాబెటిస్, స్థూలకాయం, మూత్రపిండాల వ్యాధి యొక్క కుటుంబ చరిత్ర, అంటువ్యాధులు, మాదకద్రవ్యాల వినియోగం. వీటికి దూరంగా ఉండాలి. కిడ్నీల ముఖ్యంగా మనిషి రక్తం నుండి టాక్సిన్స్, వ్యర్థాలను ఫిల్టర్ చేస్తాయి. శరీరంలో ద్రవ స్థాయిలను, రక్తపోటును నియంత్రించే హార్మోన్‌ను విడుదల చేస్తాయి. విటమిన్ డి, ఎర్ర రక్త కణాల నిర్మాణాన్ని నియంత్రించే హార్మోన్‌ను విడుదల చేస్తాయి. కిడ్నీ వ్యాధి ఉన్న వారికి గుండెపోటు, అధిక రక్త పోటు, బలహీనమైన ఎముకలు, గుండె వ్యాధి, కిడ్నీ వైఫల్యం, రక్తహీనత, తక్కువ ఎర్ర రక్త కణాల సంఖ్య వంటి లక్షణాలుంటాయి. పింక్, డార్క్ మూత్రం (మూత్రంలో రక్తం) కష్టమైన, బాధాకరమైన మూత్రవిసర్జన, మూత్ర విసర్జన అవసరం పెరగడం, దాహం పెరగడం, అలసట, బలహీనత, ఉబ్బిన చేతులు, ముఖం, పాదాలు, నురు గు మూత్రం వంటి లక్షణా లుంటే ఉంటనే వైద్యు లను సంప్రదించాలి. కాగా క్రమం తప్ప కుండా వ్యాయా మం చేయా లి. బరువును నియంత్రించి సమతుల్య ఆహారం తీసుకోవాలి. దూమపానం వదిలేసి, వార్షిక శారీరక ఆరోగ్య పరీక్ష చేయించుకోవాలని నిర్లక్ష్యం చేయవద్దని ఆయన సూచించారు.

పెదమేడపల్లిలో ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి-మెంటాడ

అనిల్ నీరుకొండ హాస్పిటల్ ఆధ్వర్యంలో పెదమేడపల్లి వైస్ సర్పంచ్ పొరుపురెడ్డి అప్పలనాయుడు అధ్యక్షతన బుధవారం పెదమేడపల్లి సచివాలయ ప్రాంగణంలో మెగా ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో 435మందికి తనిఖీలు నిర్వహించగా 82 మందిని శస్త్ర చికిత్సలకు ఎంపిక చేసినట్లు డాక్టర్ రాకేష్ చౌదరి తెలిపారు. అనంతరం రోగులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైద్యులు డాక్టర్ రాకేష్ చౌదరి, డాక్టర్ సాయి సింహ, డాక్టర్ సింధూజ, డాక్టర్ శృతి ఆనంద్, డాక్టర్ రోజా, డాక్టర్ అలేఖ్య సుమీత, పిఆర్ఒ త్రినాథ్ తోపాటు వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఏకగ్రీవానికి అంగీకరించం

ప్రజాశక్తి-పూసపాటిరేగ

కొప్పెర్ల పంచాయతీ ఎన్నిక ఏకగ్రీవానికి తాను అంగీకరించనని ఆ గ్రామానికి చెందిన శంకాబత్తుల సత్తిబాబు అన్నారు. కొప్పెర్ల సర్పంచ్ పైడి వెంకట రమణ ప్రమాదవశాత్తు ఇటీవల అకాల మరణం చెందిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలోనే గ్రామంలో సర్పంచ్ పదవికి ఉప ఎన్నిక నిర్వహించేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. గత ఎన్నికల్లో సర్పంచ్ పదవికి పైడి వెంకటరమణతో పాటు ఆకిరి జగదీష్, శంకాబత్తుల సత్తిబాబు పోటీ పడ్డారు. వీరిద్దరిపై పైడి వెంకట రమణ విజయం సాదించి పదవిలో ఉంటుండగానే మృతి చెందాడు. ఆ స్థానంలో ఆయన భార్యని ఏకగ్రీవంగా ఎన్నుకునేందుకు కొంత మంది పెద్దలు నిర్ణయించినట్లు తెలిసింది. గతంలో పోటీ పడే ఆకిరి జగదీష్ ఏకగ్రీవానికి అనుకూలంగా ఉన్నా తాను మాత్రం పోటీలో ఉంటానని సత్తిబాబు చెబుతున్నారు. ఒక్కసారి అవకాశం ఇస్తే గ్రామాన్ని అభివృద్ధి చేసి చూపిస్తానన్న నినాదంతోనే ప్రజలు దగ్గరకు వెళతానని నిర్ణయించుకున్నానన్నారు. ఇంత వరకూ పాలనంతా ఆ రెండు కుటుంబాలే చేస్తున్నాయని ఈ సారి ఒక సామాన్యుడుకు అవకాశం ఇవ్వాలని గ్రామస్థులను కోరుతానని చెబుతున్నాడు. త్వరలో నామినేషన్ వేస్తానని సత్తిబాబు తెలిపారు.

పాదయాత్రకు అడ్డంకులు సరికాదు

ప్రజాశక్తి-వేపాడ

నారా లోకేష్ చేస్తున్న పాదయాత్రకు ప్రభుత్వం అడ్డంకులు సృష్టించడం సరికాదని టిడిపి మండల అధ్యక్షులు గొంప వెంకటరావు తెలిపారు. మండల కేంద్రంలో బుధవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. జగన్మోహన్‌రెడ్డి ప్రతిపక్షంలో ఉన్నపుడు ఆయన పాదయాత్రకు ఇలాంటి అడ్డంకులు సృష్టిస్తే సజావుగా సాగేదా అని ప్రశ్నించారు. ప్రభుత్వం తీరును మార్చుకోకపోతే ప్రజలే బుద్ధి చెబుతారని హెచ్చరించారు.

ఘనంగా ముత్యాలమ్మ పండగ

ప్రజాశక్తి-వేపాడ

మండలంలోని సోంపురం ముత్యాలమ్మతల్లి తీర్థ మహోత్సం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన గుర్రపుఉ పందేలు ఆకట్టుకున్నాయి. ఇందులో భాగంగా టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కోళ్ల బాలాజీ అప్పల రాంప్రసాద్ బుధారం పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ ఉపాధ్యక్షులు పోతల వెంకటరమణ, మండల ప్రధాన కార్యదర్శి కొట్టాడ రమణమూర్తి, నాయకులు దాసరి లక్ష్మి, గొర్రెపోటు రాము, గొర్రెపోటు ప్రసాదు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నిరసన

ప్రజాశక్తి-డెంకాడ

స్థానిక ఎస్‌బిఐ వద్ద కాంగ్రెస్ ఆధ్వర్యంలో బుధవారం నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. బిజెపి ప్రభుత్వం చేపడుతున్న ఎల్ఐసి, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఇతర జాతీయ బ్యాంకుల బలవంతుపు పెట్టుబడులపై వ్యతిరేకిస్తూ నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో డెంకాడ మండల అధ్యక్షులు టి సూరిబాబు, ఆదినారాయణ, రాము, గురువులు, కృష్ణ, పి. రాము, బాలకృష్ణ, చిలకరాజు తదితరులు పాల్గొన్నారు.

తమ్మినేని, బొత్సలను కలిసిన విక్రమ్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు జిల్లాలకు వైసిపి యూత్ వింగ్ జోనల్ ఇన్ ఛార్జ్ గా నియమితులైన నేపథ్యంలో అవనాపు విక్రమ్ శాసన సభాపతి తమ్మినేని సీతారాంను ఆయన స్వగృహంలోను, విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణను వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసారు. పుష్పగుచ్చం అందించి, శాలువాతో సత్కరించారు. పార్టీ తనపై ఉంచిన బాధ్యతలతో పార్టీని బలోపేతం చేయడం లో యువశక్తిని పార్టీకి వెన్నుదన్నుగా నిలిపేందుకు కృషి చేస్తానని ఈ సందర్భంగా విక్రమ్ తెలిపారు.

అక్రమంగా విద్యుత్తు వినియోగిస్తే చర్యలు

వంగర : విద్యుత్‌ను అక్రమంగా వినియోగిస్తే చర్యలు తప్పవని ఎలక్ట్రికల్ ఎఇ వినయ్ కుమార్ అన్నారు. ఈ మేరకు ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడుతూ మండలంలో పలు గ్రామాలలో పొలాలల్లో ఉన్న పంటలను అడవి పందులు, పశువులు ధ్వంసం చేస్తున్నాయని ఉద్దేశంతో పలువురు తమ పొలం చుట్టూ తీగలతో కంచెలు ఏర్పాటు చేస్తున్నారని ఫిర్యాదులు అందుతున్నాయని తెలిపారు. అలా చేయడం వల్ల మూగ జీవాలు బలి అవ్వటమే కాక మనుషులకు కూడా అత్యంత ప్రమాదకరమైనదని స్పష్టం చేశారు. ఎవరైనా నిబంధనలు అతిక్రమించి అక్రమంగా విద్యుత్తును వినియోగించి కంచెలు ఏర్పాటు చేసినట్లు పట్టుపడితే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

మహిళాభ్యుదయానికి అధిక ప్రాధాన్యత

మహిళా దినోత్సవ వేడుకల్లో ఎమ్మెల్యేలు కళావతి, జోగారావు



పాలకొండరూరల్.. మహిళా దినోత్సవ వేడుకల్లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వి.కళావతి

ప్రజాశక్తి-పార్వతీపురం టౌన్

మహిళల అభ్యుదయానికి, ఆర్థిక స్వాలంబనకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు ఎమ్మెల్యే అలజంగి జోగారావు తెలిపారు. మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం పట్టణంలో ఉన్న సౌందర్య నారాయణమూర్తి నగర్ కాలనీలో వైసిపి ఆధ్వర్యాన మున్సిపల్ చైర్‌పర్సన్ బోను గౌరీశ్వరి అధ్యక్షతన నిర్వహించిన వేడుకల్లో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ఉత్సాహంగా ముందుకొచ్చి మాట్లాడిన మహిళలందరినీ ఎమ్మెల్యే, పరిశీలకులు శోభా హైమావతి ప్రోత్సాహకాలు అందించి అభినందించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్లు కొండపల్లి రుక్మిణి, ఇండుపూరు గున్నేశ్వరరావు, జెడ్‌పిటిసి బలగా రేవతమ్మ, ఎంపిపి మజ్జి శోభారాణి, ఎఎంసి చైర్‌పర్సన్ మరడాన భాగ్యశ్రీ, వైసిపి పట్టణ అధ్యక్షులు కొండపల్లి బాలకృష్ణ, ఫ్లోర్ లీడర్ మంత్రి రవికుమార్, పట్టణ జెసిఎస్ కన్వీనర్ గొర్లి మాధవరావు పాల్గొన్నారు.

పాలకొండ రూరల్ : మహిళల ఆర్థిక అభివృద్ధి కోసం అనేక సంక్షేమ పథకాలను ప్రభుత్వం అమలు చేసిందని ఎమ్మెల్యే వి.కళావతి తెలిపారు. బుధవారం స్థానిక తిరుమల కళ్యాణ మండపంలో ఎపి పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్ డిపార్ట్మెంట్ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలలో ఆమె మాట్లాడారు. మహిళలు అభివృద్ధి చెందితే ఆ కుటుంబం, తద్వారా ఆ ప్రాంతం, సమాజం అన్ని ముందుకెళ్తాయని చెప్పారు. మహిళా కండక్టర్లలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి ఎమ్మెల్యే సన్మానం చేశారు. అనంతరం ఎమ్మెల్యేను సత్కరించారు.

పాలకొండ : ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపల్ డాక్టర్ జి.జనార్దననాయుడు అధ్యక్షతన మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాలకొండ ఏరియా హాస్పిటల్ నర్సింగ్ సూపరింటెండెంట్ సోఫియా సౌదామని, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ బి.ప్రభాకరరావు, అకాడమీ కోఆర్డినేటర్ బి.జయమణి, తదితరులు పాల్గొన్నారు.

సాలూరు : మహిళలు చైతన్యవంతులైనప్పుడే సమాజం ప్రగతిపథంలో పయనిస్తుందని నీడ్ స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ పి.వేణుగోపాలరావు చెప్పారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా బుధవారం పట్టణంలోని వైటిసిలో నీడ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యాన నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించే విధంగా ప్రభుత్వాలు కృషి చేయాలని కోరారు. టౌన్ ఎస్ఐ పాపారావు, పాచిపెంట ఐసిడిఎస్ సిడిపిఒ అనంతలక్ష్మి మాట్లాడారు. అనంతరం సిడిపిఒ అనంతలక్ష్మి, వైటిసి స్టాఫ్ నర్స్, ఎఎన్ఎంలను సన్మానించారు. ఈకార్యక్రమంలో జెజెఎం టీం లీడర్ మోహన్, ఇతరులు పాల్గొన్నారు. బాగువలసలో నిర్వహించిన మహిళా దినోత్సవ కార్యక్రమంలో మహిళా సంఘం నాయకురాలు బొత్స సరోజినిని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్ పర్సన్ రెడ్డి పద్మావతి సన్మానించారు.


కురుపాం : మహిళలు ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా ఎదగాలని ఎంపిపి శెట్టి పద్మావతి అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని మండలంలో దురిబిలి గ్రామంలో బుధవారం యూత్ ఎంపవర్‌మెంట్ సర్వీస్ సొసైటీ కార్యదర్శి షేక్ గౌస్ ఆధ్వర్యంలో సర్పంచ్ పి.అజ్జరి అధ్యక్షతన సమావేశం ఏర్పాటుచేశారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి గొర్లి సుజాత, కురుపాం సర్పంచ్ గార్ల సుజాత, ఎఒ పి.నాగేశ్వరరావు, మాజీ సర్పంచ్ పత్తి పాల్గొన్నారు. స్థానిక కోర్టు వద్ద మహిళలకు జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ ఎం.రోహిణీరావు మహిళా చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో న్యాయవాది బరాటం చంద్రమౌళి, ఎంపిటిసి సోమయోజులు పాల్గొన్నారు.

పాచిపెంట : మండలంలో పనుకువలస గ్రామంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. స్ఫూర్తి మహిళా మండలి డైరెక్టర్ బలగ రాధ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో సాలూరు రూరల్ సిఐ ఎస్.ధనంజయరావు మాట్లాడారు. అనంతరం సిఐ ఎస్.ధనంజయరావు, ఇఒపిఆర్‌డి ఎస్‌వి కుమారి, మాజీ జెడ్‌పిటిసి మంచాల పారమ్మను సత్కరించారు.

కలెక్టరేట్ : సమాజంలో సగమైన మహిళను ప్రతిఒక్కరూ గౌరవించాలని ప్రముఖ రచయిత గంటేడ గౌరునాయుడు కోరారు. గిరిజన సామాజిక భవనంలో స్నేహ కళా సాహితి, జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ సభ చేర్పాటుచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటా, బయట మహిళను ప్రతిఒక్కరూ గౌరవించాలనే మార్పు సమాజంలో రావాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా మహిళా పారిశుధ్య కార్మికులు సత్యవతి, అసిరమ్మను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ పిఒ విజయగౌరి, జన విజ్ఞాన వేదిక జిల్లా కార్యదర్శి డి.చంద్రమౌళి, కోశాధికారి ఫరూక్, తదితరులు పాల్గొన్నారు.

సీతంపేట : మండలంలోని పూతికవలస గ్రామంలో వెలుగు ఆధ్వర్యంలో మహిళా దినోత్సవ సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో వక్తలు బి.వెన్నెల, కె.దాసునాయుడు మాట్లాడారు. పూతికవలస, వడబింద, కొత్తగూడ మహిళలకు ఆటలు పోటీలు నిర్వహించారు. విజేతలకు బాలికల ఆశ్రమ పాఠశాల వార్డెన్ నాగమణి బహుమతులు అందజేశారు. కార్యక్రమాన్ని వెలుగు ఏరియా కోఆర్డినేటర్ సవర ఆనందరావు, ఎడ్యుకేషన్ ఏరియా కోఆర్డినేటర్ బి. వెన్నెల, టిసిఒ మిన్నరావు పాల్గొన్నారు.

పార్వతీపురం రూరల్ : ఆర్‌సిఎం కార్యాలయ సముదాయం వద్ద మహిళా హక్కులు, చట్టాలపై రెండో అదనపు జిల్లా జడ్జి ఎస్.దామోదరరావు అవగాహన కల్పించారు. అనంతరం స్త్రీ, శిశు సంక్షేమ అధికారి కేతిరెడ్డి విజయ లక్ష్మి మాట్లాడారు. కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి జి.యజ్ఞ నారాయణ, అదనపు జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ డి.సౌజన్య, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎ.రమేష్, న్యాయవాదులు జోగారావు, వెంకటరావు పాల్గొన్నారు.



పార్వతీపురంటౌన్.. మహిళలకు కేకు తినిపిస్తున్న ఎమ్మెల్యే జోగారావు



కలెక్టరేట్.. మహిళలను సన్మానిస్తున్న స్నేహ కళాసాహితి, జెవివి సభ్యులు



పాచిపెంట.. పనుకువలసలో ర్యాలీ నిర్వహిస్తున్న 'స్ఫూర్తి' సభ్యులు, సిఐ

ఉత్తరాంధ్ర అభివృద్ధి కోసం

పిడిఎఫ్ అభ్యర్థి రమాప్రభను గెలిపించాలి

ప్రజాశక్తి-పార్వతీపురంరూరల్

ఉత్తరాంధ్ర వెనుకబాటు తనంపై చట్టసభలలో పాలకులను నిలదీసేందుకు పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కోరెడ్ల రమాప్రభను గెలిపించాలని సిఐటియు జిల్లా నాయకులు రెడ్డి వేణు కోరారు. బుధవారం మండలంలోని పులిగుమ్మి, పుట్టూరు, లచ్చిరాజుపేట, గ్రామాలలో రమాప్రభకు మద్దతుగా ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 16 ఏళ్లుగా శాసనమండలిలో, వెలుపల ఉద్యోగ, ఉపాధ్యాయ, కర్షక, కార్మిక, విద్యార్థి, యువత సమస్యలపై పోరాడుతన్నది పిడిఎఫ్ ఎమ్మెల్సీలు మాత్రమేనని చెప్పారు.ఉత్తరాంధ్ర వెనుకబాటుపై ప్రశ్నిస్తున్నారని చెప్పారు. విజ్ఞులైన పట్టభద్రులు రాజకీయ నాయకుల మాయమాటలకు లొంగిపోకుండా, నిత్యం ప్రజా సమస్యలపై గొంతెత్తి పోరాడుతున్న పిడిఎఫ్ అభ్యర్థి రమాప్రభకు మద్దతివ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు టి.వెంకటేశ్వరరావు, రెడ్డి రమణ, నాగరాజు పాల్గొన్నారు.



పార్వతీపురంరూరల్.. ప్రచారం చేస్తున్న ప్రజా సంఘాల నాయకులు రెడ్డి వేణు, తదితరులు

పార్వతీపురం టౌన్ : ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ పిడిఎఫ్ అభ్యర్థి డాక్టర్ కోరెడ్ల రమాప్రభకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని ప్రజా సంఘాల నాయకులు బుధవారం పట్టణంలో ప్రచారం చేశారు. కవులు, రచయితలు గంటేడ గౌరునాయుడు, మల్లిపురం జగదీష్, సిరికి స్వామినాయుడు, పక్కి రవీంద్ర, నీవంనాయుడు, వాసుదేవరావు, రోహిణీ కుమార్, చుక్క పారినాయుడు తదితరులను కలిసి ఉత్తరాంధ్ర అభివృద్ధి కోసం పిడిఎఫ్ అభ్యర్థిని గెలిపించాలని విజ్ఞప్తిచేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు గొర్లి వెంకటరమణ, బంకురు సూరిబాబు, గిరిజన సంక్షేమ సంఘం నాయకులు పి.రంజిత్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

పాచిపెంట : మండలంలోని పూడి, నందేడవలస, మోసూరు, రాయిగుడ్డివలస గ్రామాల్లో పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ కోరెడ్ల రమాప్రభకు మద్దతుగా సిఐటియు జిల్లా నాయకులు కోరాడ ఈశ్వరరావు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు మర్రి శ్రీనివాసరావు ప్రచారం చేపట్టారు. ఈ నెల 13న జరిగిన ఎన్నికల్లో డాక్టర్ కోరెడ్ల రమాప్రభకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు.


సీతానగరం : పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కోరెడ్ల రమాప్రభకు మద్దతుగా ప్రజా సంఘ నాయకులు బుధవారం సీతానగరం, తామరకండి, బాలకృష్ణాపురం, చినబోగిలి గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు రెడ్డి ఈశ్వరరావు, ప్రజా సంఘ నాయకులు జి.వెంకటరమణ, బి.అప్పారావు, ఆర్.రాము పాల్గొన్నారు.

పాలకొండ రూరల్ : పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ కోరెడ్ల రమాప్రభను గెలిపించాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు దావాల రమణారావు, జెవివి జిల్లా కార్యదర్శి ఎస్.మహేష్, ప్రజాసంఘాల నాయకులు బి.పట్టాభి తదితరులు బుధవారం విస్తృత ప్రచారం నిర్వహించారు.

కొమరాడ : పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి రమాప్రభను గెలిపించాలని సిఐటియు నాయకులు కొల్లి సాంబమూర్తి కోరారు. స్థానిక వైకెపి కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన మహిళా దినోత్సవ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. యువత, విద్యార్థులు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు, ప్రజా సమస్యలపై పోరాడే పిడిఎఫ్ తరపున పోటీ చేస్తున్న రమాప్రభకు అంతా మద్దతివ్వాలని కోరారు.








కొమరాడ, పాలకొండ, పాచిపెంట మండలాల్లో పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కోరెడ్ల రమాప్రభకు మద్దతుగా ప్రచారం చేపడుతున్న ప్రజా సంఘాల నాయకులు కె.సాంబమూర్తి, దావాల రమణారావు, మర్రి శ్రీనివాసరావు, కె.ఈశ్వరరావు, తదితరులు

వికలాంగునికి పింఛను అందజేత

జిల్లా కలెక్టర్ ఆదేశాలతో కదిలిన అధికారులు ● 'ప్రజాశక్తి' కథనానికి స్పందన

ప్రజాశక్తి-సాలూరు

పట్టణంలోని పదో వార్డు పరిధిలో నెయ్యిల వీధికి చెందిన వికలాంగుడు మందాడి సింహాచలానికి బుధవారం సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ అంజిబాబు మూడువేల రూపాయల పింఛను మొత్తాన్ని అందజేశారు. స్థానిక ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సింహాచలం వద్దకు వెళ్లి ఆ నగదు అందించారు. 'వికలాంగునికి కడుపుకోత' అనే శీర్షికతో ప్రజాశక్తిలో బుధవారం ప్రచురితమైన కథనానికి జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ స్పందించారు. మున్సిపల్ కమిషనర్ హెచ్.శంకరరావుకు ఫోన్ చేసి వికలాంగుడు సింహాచలానికి పింఛను అందించాలని కలెక్టర్ ఆదేశించినట్లు తెలుస్తోంది. దీంతో కమిషనర్ శంకరరావు సంబంధిత వార్డు సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ అంజిబాబును పింఛను మొత్తం అందజేయాలని ఆదేశించారు. సింహాచలం రేషన్ కార్డులో రాజమండ్రికి చెందిన ప్రభుత్వ ఉద్యోగి పేరు కలిసిన కారణంగా పింఛను నిలిచిపోయిందని అంజిబాబు తెలిపారు. ఆ ఉద్యోగి పేరు తొలగింపు ప్రక్రియ జిల్లా స్థాయిలో జరుగుతుందని, యథావిధిగా వికలాంగుడు మందాడి సింహాచలానికి పింఛను మంజూరవుతుందని చెప్పారు. గత ఎనిమిది నెలలుగా పింఛను నిలిచిపోవడంతో తీవ్ర ఆందోళనకు గురైన సింహాచలం.. పింఛను అందడంతో ఆనందం వ్యక్తం చేశారు.



సింహాచలానికి పింఛను డబ్బులు అందిస్తున్న వెల్ఫేర్ అసిస్టెంట్

అయ్యప్ప విగ్రహానికి అభిషేకం



అయ్యప్ప విగ్రహానికి అభిషేకం చేస్తున్న కాళిదాసు

ప్రజాశక్తి-పార్వతీపురం టౌన్

పట్టణంలో రాజీవ్ మార్గంలో ఉన్న అయ్యప్ప స్వామి ఆలయంలో అయ్యప్ప విగ్రహానికి దేవాలయ నిర్వాహకులు మురపాక కాళిదాసు యాజి అభిషేకాలు నిర్వహించారు. అయ్యప్పస్వామి జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం ఈ కార్యక్రమాలు చేపట్టారు. అనంతరం గణపతి హోమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విగ్రహ ప్రతిష్టాపకులు పొట్నూరు గౌరీ శంకర్రావు, లావణ్య దంపతులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శి నిర్లక్ష్యం

ప్రజాశక్తి-కొమరాడ

పంచాయతీ కార్మికులకు జీతాలివ్వకుండా ఇష్టం వచ్చినట్లుగా మాట్లాడుతున్న కొమరాడ సచివాలయ కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలని సిపిఎం నాయకులు కొల్లి సాంబమూర్తి అధికారులను డిమాండ్ చేశారు. బుధవారం కొమరాడలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఇటీవల జీతాల కోసం కార్యదర్శి వద్దకు కార్మికులు జమలయ్య, రాము, ఆనంద్ వెళ్తే, 'మీకు జీతాలు లేవు. మీపై పోలీస్ రిపోర్ట్ ఇస్తాం. పనిచేస్తే చేయండి. లేకపోతే వెళ్లిపోండి' అంటూ నిర్లక్ష్యంగా మాట్లాడారని తెలిపారు. దీంతో వేదనకు గురైన కార్మికులు ఐదు రోజులుగా పనికి రాకపోవడంతో పారిశుధ్యం అధ్వానంగా తయారైందన్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరించిన కార్యదర్శిపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

వివాహిత అనుమానాస్పద మృతి

ప్రజాశక్తి-బలిజిపేట

మండలంలోని నారాయణపురం గ్రామానికి చెందిన ఎలమంచిలి హేమలత (28) అనే వివాహిత అనుమానాస్పదంగా మంగళవారం రాత్రి మృతిచెందింది. ఎస్ఐ ప్రశాంత్‌కుమార్ కథనం ప్రకారం..

కొమరాడకు చెందిన ఎలమంచిలి హేమలతకు నారాయణపురానికి చెందిన చిన్ననరసయ్యతో 2018లో వివాహమైంది. వీరికి ఇద్దరు పిల్లలున్నారు. మంగళవారం రాత్రి 11 గంటల ప్రాంతంలో హేమలత ఇంట్లో ఉరి వేసుకుని మృతిచెందినట్లు కుటుంబ సభ్యులు చెబుతున్నారు. హేమలతది ఆత్మహత్య కాదని, అత్తారింటి వారే హత్య చేసి, ఆత్మహత్య చిత్రీకరిస్తున్నట్లు మృతురాలి తమ్ముడు పుల్లరి లోకేష్ పోలీసులకు ఫిర్యాదుచేశాడు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

మహిళలకు చీరలు పంపిణీ

ప్రజాశక్తి-పార్వతీపురంరూరల్

అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా హెడ్ కానిస్టేబుల్, వృద్ధమిత్ర కోఆర్డినేటర్ కె.కృష్ణమూర్తి బుధవారం గిరిజన గ్రామం కొత్తఊరులో 30 మంది మహిళలకు చీరలు, స్టీల్‌గ్లాసులు పంపిణీ చేశారు. గ్రామ నాయకులు హిమరిక సంగయ్య, భాస్కరరావు, లక్ష్మణరావు, సోదారామ్, బొండపల్లి జనార్దన్ ఆధ్వర్యంలో వాటిని వితరణ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మహిళలను గౌరవించాలని, సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా ఎదిగేందుకు సహాయపడాలని కోరారు.



మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న హెచ్‌సి కృష్ణమూర్తి